మహేంద్ర

పెద్ద కథ ప్రారంభం

# కనిపించని కోయిల

పరుగెత్తే రైలు నిలిచే ఒక క్షణం ఆ స్టేషన్. దినమంతా సోమరిగా వుండే స్టేషన్ పరుగెత్తే ఒక క్షణమే ఆ రైలు.

ఆ స్టేషన్ పట్టణానికి చాలా దూరంగా వుంది. స్టేషన్లో నుంచీ వూర్లోకొక వుంత దారి, దారి కిరుప్రక్కలా దట్టంగా పెరిగిన కంచె చెట్లు, ఊరి చుట్టూ వరి పొలాలు, చెరకు మళ్ళు, ఆకుదోటలు, మామిడి తోపులు – అంతటా అక్కడక్కడా తొంగిచూచే కొబ్బరి చెట్లు ఊరిప్రక్క నొక వాగు. వాగు మీదొక వంతెనా, వంతెన మీద వెళ్ళే రైలూ –

స్టేషన్లో రైలు ఆగిన చప్పుడు. రైలు ఆగమనంలో దుమ్మురేగి పైకెగిరిన ఎండుటాకులు రైలు ఆగడంతోనే నేల మీద పడ్డాయి. పోర్టరు సూరన్న రేణి పండ్ల బుట్ట లుంచిన ట్రాలీని తోసుకుని బ్రేక్‌వేన్‌కేసి నడిచాడు. పోస్ట్‌మేన్ 'ఆరెమ్మెస్' నుంచి తపాలా సంచీ దించుకుంటున్నాడు ఇడ్లీ లమ్మే పిల్లవాడు రైలు కిటికీల గుండా పాసింజర్లతో బేరం సాగిస్తున్నాడు. అక్కడొకడూ ఇక్కడొకడూ ఒకరిద్దరు బిచ్చగాళ్ళు దిగారు.

నిశ్శబ్దం భరించలేనట్టుగా రైలు ఒక చిన్న కూతవేసింది. బుడుంగున చెరువులోనికి మునిగిపోతున్న గులకరాయిచేసే శబ్దంలా స్టేషన్ గంట మ్రోగింది.

సరి సరి. ఇప్పటికే అరగంట లేటు, తెములమన్నట్టుగా విజిల్ వేస్తాడు గార్డు.

''వెళ్తానహో!...కూక్''

తనకు తానే బహుపరాకుగా సాగబారుతుంది రైలు.

''వెళ్ళిహో...'' ప్రొద్దు బారడెక్కినా లెక్కసేయకుండా సీటు కింది బిచ్చగాడు అటు దిరిగి పడుకున్నాడు.

రైలు వెళ్ళిపోయినా అలవాటుగా జెండా వూపుతూనే ఉండిపోయాడు ఎస్సెమ్ శ్రీరాములు.

ఇది రోజూ జరిగే తతంగమే. ఐతే ఆరోజు –

''ఏంసార్! బాగున్నారా'' అన్న రవి పలకరింపుతో స్టేషను మాష్టరు ఇహలోకం లోకి పడ్డాడు. ఐతే ఆ పలకరిస్తున్న యువకుడెవడో ఆయన కింకా గుర్తు రావడం లేదు. గుర్తించడానికి ఆయన పడుతున్న అంతర్మథన మంతా ముఖంలో స్ఫుటంగా కన్పిస్తోంది.

''నేనండీ, రవిని. రామనాథంగారి అబ్బాయిని'' అంటూ రవి తనను తాను పరిచయం చేసుకున్నాకగానీ శ్రీరాములు పడుతున్న విచికిత్స ఒక కొలిక్కి రాలేదు.

''నువ్వా నాయనా, బాగా మారిపోయినట్టున్నావు! అందుకే గుర్తుపట్టలేకపోయాను. చదువు పూర్తయినట్టేనా?'' కుశల ప్రశ్నలువేస్తూ ఆఫీసువైపు నడిచాడు శ్రీరాములు.

''ఈ ఏటితో బి. ఏ. పూర్తవుతుందిసార్. ఆఖరి పరీక్ష నిన్ననే జరిగింది. హాస్టల్ రూంను నిన్ననే వెకేట్‌చేసి, సిరిపురం జంక్షను వరకు మెయిల్లో వచ్చి, రాత్రి అక్కడనుంచి రెండు గంటల పాసింజర్లో వస్తున్నాను.'' అంతకు ముందొక నెల రోజులుగా పరీక్షలకై విపరీతంగా శ్రమించడంవల్ల, రాత్రంతా ప్రయాణం చేసిన బడలిక చేతా అలసిపోయిన రవి హోల్డాలు, సూట్‌కేసులను ఇరుచేతుల్తో మోస్తూ స్టేషన్‌మాష్టర్ని అనుసరించాడు.

దుమ్ముకొట్టుకపోయిన తలా, నలిగి మాసిపోయినబట్టలూ, నిద్ర జాలక ఎర్రబడ్డ కళ్ళు, చేతుల్ని లాగేస్తున్న లగేజీ – తన వాలకం జూసి తానే జాలిపడిపోతూ రవి చివరికెలాగో ఆఫీసువరండాలోని బెంచీ మీదికి జారిపోయాడు. సినిమా చివర్లో అనేక కష్టనష్టాలకోర్చి కలుసుకున్న హీరో హీరోయిన్లు ఒకరిపై కొకరు వాలిపోయినట్టుగా సూట్‌కేసు, హోల్డాలు ఒకదాన్నొకటి అనుకుని చేరగిల పడిపోయాయి.

''మరీ ఒక రాత్రి ప్రయాణానికే ఇంత డీలా పడిపోతే ఎలాగయ్యా! లే, లేచి కొళాయి దగ్గరికెళ్ళి ముఖం కడుక్కుని రా. ఎండ అప్పుడే కరకరలాడిపోతోంది.'' అంటూ శ్రీరాములు రవితో ఉపశమన వచనాలు పలికి, సూరన్నతో ఫ్లాస్కుతో కాఫీ తెమ్మని తన క్వార్టర్సుకు పంపించాడు.

ప్లాట్‌ఫారం అంతటా ఒక విచిత్రమయిన ప్రశాంతత పరచుకుని వుంది. స్టేషన్లో దిగి మళ్ళీ వెళ్ళిపోయే దేశద్రిమ్మరి బిచ్చగాళ్ళ లాంటి గాలులు మాత్రం ఆకుల గుబుర్లలో వుండి వుండీ సవ్వడి చేస్తున్నాయి.

చల్లటి కొళాయి నీళ్ళతో ముఖం కడుక్కుని స్టేషనునంతా పరికించి చూస్తూ తిరిగి ఆఫీసులో కడుగుబెట్టేసరికి రవికి టేబిల్ మీది ఫ్లాస్కు మూతలో కాఫీ సెగలు గ్రక్కుతూ కన్పించింది. స్టేషను మాష్టరు రిజిష్టర్లోకి ముఖంబెట్టి సన్నగా కూనిరాగం తీస్తూ కూడికలు వేసుకుంటున్నాడు.

రవి కాఫీ త్రాగడం ముగించి లేచి, పాంటు జేబులోంచి దువ్వెనతీసి తల దువ్వుకుంటూ ''ఇంటికి వెళ్తాను సార్. ఎండెక్కిపోతోంది''అంటూ సెలవుపుచ్చుకున్నాడు. శ్రీరాములు సూరన్నతో హోల్డాల్ను రామనాథం గారింటి దగ్గర దింపి రమ్మని పురమాయించి, మళ్ళీ రిజిష్టర్లోకి తల దూర్చేశాడు.

స్టేషన్లో నుంచి ఊర్లోకి వెళ్ళేదారి ఒక మైలుకు పైగా వుంటుంది. సూరన్న మారిపోతున్న వూరిని గురించి, మనుషుల్ని గురించి ఏకరువు బెడుతున్న మాటల కన్నింటికీ ఊ కొడుతూ ఆ దారి వెంబడి నడువసాగాడు రవి. గత ఇరవై ఏళ్ళ జీవితంలో తనకు పదిహేనేళ్ళకు పైగా గాఢ పరిచయంగల ప్రాంతమంతా పెద్ద మార్పులు లేకపోయినా కొత్తగా కనబడుతూండడం మరి చోద్యంగా వుంది రవికి. నిర్జనంగావున్న రోడ్డులో ఊరు దగ్గరబడేసరికి ఒక రిద్దరుగా మనుషులు ప్రత్యక్షం కాసాగారు. వారిలో చాలా ముఖాలు క్రొత్తవిగా వుండడం, పాత ముఖాలు గూడ క్రొత్తగా కన్పడడం చేత ఏదో కొత్త ప్రపంచంలోకి వచ్చినట్లుంది అతని పరిస్థితి. ''ఏం నాయనా బాగున్నావా!'', ''చదువు పూర్తయిందా'' అంటూ కన్పించిన వారందరూ వేసిన ప్రశ్నలే మళ్ళీ మళ్ళీ వేస్తుండడం చిరాకు కల్గిస్తోంది అతనికి. ఇంటి గడప ఎక్కేసరికి టైమ్ పది దాటిందని గడియారం చెబుతోంది.

తడి చేతితో కొంగును తుడుచుకుంటూ వంటింటిలోనుంచి వచ్చి రవి ప్రక్కగా నిలుచుంది అతని తల్లి జానకమ్మ. పొగలో నుంచి రావడం వల్లనో, ఏడెనిమిది నెలల తర్వాత కొడుకును చూడడం వల్లనో ఆమె కళ్ళ చివర్లు కొద్దిగా తడిసి వున్నాయి.

అపురూపంగా కొడుకుకేసి చూస్తూ ''నీళ్ళు త్రాగుతావా రవీ'' అంటూ లోనికెళ్ళి నీళ్ళు దెచ్చింది జానకమ్మ. నీళ్ళు త్రాగి చెంబు నామెచేతికిస్తూ రవి ఇల్లంతా కలయజూసాడు. పెరటివైపు వరండా గుమ్మం పుచ్చుకు వూగుతున్న చెల్లెలు అమల నవ్వుతూ అంది

''అన్న బాగా పొడుగయినాడు గదమ్మా!''

''హాస్టల్లో ఏం దింటున్నావురా నాయనా, మరీ చిక్కిపోయావు! ఎండల్లో తెగదిరిగావు కాబోలు, ఛాయకూడ తగ్గింది'' వాపోయింది జానకమ్మ.

''అదేం లేదమ్మా. అక్కడ ఎండలు మరీ ఎక్కువ. సాయంత్రం అయిదింటికి గాని హాస్టల్ వదిలేవాళ్ళం గాదు. ఇరవై నాలుగ్గంటలూ ఫేన్ దిరిగినా చెమటతో, ఉక్కతో వొళ్ళంతా హూనం అయిపోయేదనుకో! పగలంతా నిద్రబోయి రాత్రే చదివే వాళ్ళం'' సంజాయిషీ చెప్పుకున్నాడు రవి.

''సంక్రాంతి కొస్తానని రాలేదేమన్నా? నేను, రాజా, అమ్మ, నాన్న అందరూ చూసి చూసీ విసిగిపోయాం అనుకో. పశువుల పండుగ మరుదినం అమ్మకు జ్వరంచేసి రాత్రిళ్ళు నిన్నే కలవరించింది'' అమల నిష్ఠూరం జేసింది.

''వద్దామనే అనుకున్నామమ్మా! కానీ పోర్షన్సు జరగలేదని లెక్చరర్లందరూ స్పెషలు క్లాసులు దీసుకున్నారు. ఐనా అమ్మకు జ్వరం చేసిందని మీరు ఉత్తరంలో వ్రాయలేదే'' తల్లికేసి ఆపేక్షగా జూస్తూ అన్నాడు రవి.

''పర్లేదురా బాబూ, ప్రయాణంలో బాగా అలసిపోయినట్టున్నావు. లేచి బట్టలు విప్పి పంచెకట్టుకో. నూనంటుతాను స్నానం చేద్దువుగానీ, బడలిక తీరుతుంది.'' అంటూ దండెం మీది నుంచి పంచె నొకదాన్ని తెచ్చి ఇచ్చింది జానకమ్మ.

షర్టు విప్పబోతూ అందాకా వీధివైపు వరండాలో నిల్చుని వున్న సూరన్నను చూశాడు రవి.

''వెళ్ళొస్తాను బాబూ! సాయంత్రం టేషను కాడికొస్తారు గదా'' అంటూ కదలబోయాడు సూరన్న.

''సూరన్నా, రేగిపండ్లు తేలేదా'' అమల గట్టిగా కేకవేసింది, పెరటివైపు వరండాలో నుంచే.

''లేదమ్మా. సాయంత్రం అన్న దగ్గర యిచ్చి పంపిస్తాలే'' అన్నాడు సూరన్న. పర్సులో నుంచి ఓ యాభై పైసల నాణెందీసి వెళ్ళబోతున్న సూరన్న చేతిలో వుంచాడు రవి.

చిన్న తువ్వాలు చుట్టుకుని పీటపై కూర్చున్నాడు రవి. జానకమ్మ తల అంటుతూ అడిగింది :

''హాస్టల్లో రోజూ చన్నీళ్ళేనారా? అక్కడి పిల్లలు తలంటుకోవడం లాంటిదేమైనా వుంటుందా ?''

''చన్నీళ్ళయినా అలవాటయినాక ఏం జేస్తాయిలే అమ్మా! అవయినా రెండు నెలల క్రితం వరకు రోజంతావచ్చేవి కొళాయిల్లో. ఒకటి ఒకటిన్నర నెలలుగా రోజుకు ఒకటి రెండు గంటలుమాత్రమే వచ్చేవి. మార్చి నెలలో ఒకసారి కొళాయిల్లో నీళ్ళురాక వరుసగా మూడు రోజులు స్నానం చేయలే దెవరూ.''

''ఏం చదువులో లేరా రవీ — హాయిగా ఇంటి పట్టునుండి పొలం పుట్ర చూసుకునే దాంతో సమానమా ఏమన్నావా'' అని నూనెగిన్నె పెట్టిరావడానికి వంటింట్లోకెళ్ళింది జానకమ్మ.

''రాజా ఎక్కడే అమలా ? నాన్న, వాడూ వచ్చినప్పట్నుంచి అసలు కన్పించనేలేదు'' చెల్లెల్ని అడిగాడు రవి.

''ఫరవాలేదే! ఇప్పటికయినా గుర్తొచ్చారు'' నవ్వుతూఅంది అమల. ''నాన్న ఉదయంఅనగా వెళ్ళారు రామాపురానికి నైట్రేట్ తీసుకురావడం కోసం. రాజా సంగతిమాత్రం నన్నడక్కు. వస్తోంది అమ్మనే అడుగు సుపుత్రుడి లీలలు'' అంటూ తల్లి దెస చూపింది.

''వాడు నా మాటలు మాత్రం ఏం వింటాడులేరా రవీ! పరీక్షల వరకయినా ఉదయం సాయంకాలం ఇంటి పట్టున వుండే వాడు. సెలవులు మొదలయినప్పట్నుంచి యింటి దగ్గరొక క్షణం ఉండడం లేదు. ఊరంతా బలాదూరుదిరగడంలో వాడికదేం ఓపికో గానీ నాయనా — వాడికి అరికాల్లో చక్రం పుట్టినట్టుంది. దానికి తోడు వాడికి సరయిన సైన్యం దొరికింది. వూర్లో ఏమూల ఏం జరిగినా ఈ కోతిమూక అక్కడ హాజరు ...... మీ నాయనకా ఒక క్షణం తీరికలేదు. ఒంటిమనిషి సేద్యమా, ఎక్కడికని దిరగతారు. మడి చెరువుకింద. తోపావంక వార, చేనేమో గుట్టకింద. ఇప్పుడు కూలీలు మరీ బరితెగించిపోయారు. నిక్కి, నీలిగి పదకొండుగంటల బండొచ్చే వేళకి వొస్తారా, సందేళ పొద్దొక పక్క గూట్లో పడక ముందే కయ్యవెలికి కాలుబెడ్తారు. మనిషుంటే ఒకపనీ, మరుగైతే

ఒక పని. మళ్ళీ రూకలు ఒకణా తగ్గితే గొంతుగోసిన కోడిలా గిల గిల కొట్టుకుంటారు. నిరుడు సాల్లో చెరువులో నీరెండి నాలుగెక రాలా బీడేగదా — పోయిన్నెల్లో అదేం మాయ తుపానో వారం పది రోజులు ఒకటే జడివట్టుకొని మామిడిచెట్టు పూతా, పిందే అంతా రాలిపోయి ఈసారి యింటికి గూడ పండ్లు కరువే ......''

కాశ్మీరులోనో, ఊటీలోనో తీసిన పూర్తి అవుట్‌డోర్ ఈస్ట్ మన్ కలర్ సినిమాను చూసి వెలుపలికొచ్చి, సైడు కాలువ ప్రక్క టీ కొట్లో పదిహేను పైసలిచ్చి మంచినీళ్ళకంటే ఏ విధంగాగానీ నయంగా లేని టీ నీళ్ళు త్రాగినట్టుంది రవి పరిస్థితి, తాను కాలేజీ నుంచి స్వగ్రామం రావడం.

అమల రెండు చెవులను చిటికెన వేళ్ళతో మూసుకుంటూ ''అబ్బబ్బా, అయిపోయిందా అమ్మా నీ సోది! జరుగుతున్నదంతా జరుగుతూనే వుందిగదా! నీకు మాత్రం ఎందుకీ లేనిపోని ఆరాటం '' అంటూ విసుక్కుంది.

రవి లేచి నిలబడి సబ్బు అందుకోబోతున్నవాడు ఆగి ''నీకేం తల్లీ అందరిదీ ఆరాటమే! రేపు మీ అత్తగారికి నూటపదకొండూ ఇచ్చుకోవలసింది మేమేగదా'' నవ్వుతూ చెల్లెలి పైకి ఒక విసురు విసిరాడు.

''నువ్వు గూడ అమ్మకు వంతపాడడం మొదలెట్టావా తంద్రీ! ఇక ఇంతే సంగతులు'' పరుగ్గా వరండాలోకి నడిచిపోయింది అమల.

ఎండ కొబ్బరాకులనుండి తొట్టిలోని నీళ్ళపై తళతళ మెరు స్తూంది. వాన వెలిశాక బైటికొచ్చిన సూర్యునిలా సబ్బు బిళ్ళ నీలంరంగు సబ్బుపెట్లో నిగనిగలాడుతోంది. తలారా స్నానం చేయ డంతో రవికి కొత్త జన్మ ఎత్తినంత తేలికగా వుంది. దొడ్లో పూల చెట్లు ఏపుగా పెరిగి ఇంటిచుట్టూ ఆహ్లాదకరమయిన వాసనల్ని వెదజల్లుతున్నాయి.

''ఈ ఏడు తుపానువల్ల వాటిల్లిన నష్టం మాటకేమిగాని కొండా కోనా బాగా పచ్చబడినట్టుంది గదమ్మా!'' టవలుతో తడి తలను తుడుచుకుంటూ ఇంట్లోకి దారితీసాడు రవి.

''అవును వడ్లకుప్ప వర్తుపోయినా వాన కరువు పడ కూడదుగదా. ఈ వానల్లో చెరువునిండి మొరవబోతోందిగదా. ఇంక రెండు మూడు ఫలితాలకు నీళ్ళభయంలేదు'' పీట వేసి పళ్ళెం ముందు బెడుతూ అంది జానకమ్మ.

''అదేమిటమ్మా, అమల పెరటివైపు వరండా వదలి రావడం లేదు! రాజా ఎప్పటి కొచ్చేటట్టు? అమల్నైనా పిలువు అన్నం తినడానికి'' అన్నంలోకి పచ్చడి కలుపుకుంటూ అన్నాడు రవి.

''దానికేం తొందరలేదా? తెల్లారక ముందొకసారి, తొమ్మిది కొకసారి అప్పుడే రెండుసార్లు చద్దన్నం ఉప్మా వరసబెట్టి మెక్కింది'' అంది జానకమ్మ.

గోంగూర, ఆవకాయ, గడ్డపెరుగు, వడియాలు మొదలైన వాటితో రుచికరమయిన పల్లెటూరి భోజనం సంతుష్టిగా తిన్న రవికి లోకమంతా సుఖసంతోషాలతో మునిగి తేలుతున్నంత సంతృ ప్తిగా వుంది. బ్రేవ్‌మని త్రేన్పుతూ నడవకు ఉత్తరంవైపు గదిలో కెళ్ళి మంచంమీద పడుకున్నాడు, ఆ రోజుటి పేపరు తిరగేస్తూ.

హెడ్‌లైన్సు చూసేసరికి లీలగా ఆవులింతగా ప్రారంభ మయిన మత్తు - పది నిముషాలయ్యేసరికి అవలీలగా గాఢనిద్రగా మారిపోయింది.

* * *

దాదాపు నాలుగు గంటల సమయంలో నిద్రాభంగం కల్గింది రవికి. అలవాటుగా చేయి ఎడమవైపు కెళ్ళింది టేబిల్ పైని రిస్ట్ వాచ్ అందుకోడానికి. కానీ అంతలోనే యిది ఇల్లనీ హాస్టల్ రూం కాదనీ తెలిసొచ్చింది. కొంచెం తుంపర కూడా పడివుండడంతో పరి సరాలు మట్టివాసన వేస్తున్నాయి. వంటింటిలోనుంచి ఏవో ఫల హారాల వాసనలు, కిటికీగుండా పందిరి అంతా అల్లుకుని ఇంటిపైకి నవలు సాచుతున్న మల్లెతీగలనుంచీ పూలవాసనలు—అన్నీ కలిసి ఏదో విచిత్ర వాతావరణం తలపిస్తున్నాయి.

ఐతే నిజానికి రవికి నిద్రాభంగం కల్గడానికి ఇవేవీ కారణం కావు. కొండపైనుంచి లోయల్లోకి దూకుతున్న సెలయేరు చేసే ధ్వని పోలిన శబ్దప్రవాహం ఏదో నేరుగా తన నెత్తిమీదనే దూకు తున్నట్టు, పాయలుగా చీలి శరీరమంతా ప్రవహించి నిశ్శబ్దంలోకి కలసిపోతున్నట్టు అతనికి తోచింది.

పెరట్లోవున్న అమలతో తన గదిలోనుంచే ఎవరో పెద్దగా సంభాషణ సాగిస్తున్నారు. చాలని దానికి అలమారుల తలుపులు తీసి


# భారతి

## చందా వివరములు

| | ఏజంటుద్వారా | పోస్టులో |
|---|---|---|
| విడి ప్రతి | రు. 1-50 | - |
| 6మాసములచందా | రు. 9-00 | 9-60 |
| సంవత్సరచందా | రు. 18-00 | 19-20 |

ఒకేసారి ఆంధ్రపత్రిక ఆఫీసుకు నేరుగా చెల్లిస్తే సంవత్సరచందా 12-00

మేనేజరు
భారతి

విసురుగా వేస్తున్న చప్పుళ్ళు, టేబిల్ సొరుగులు లాగి ముందుకు నెడుతున్న ధ్వనులు నిరాటంకంగా జరిగిపోతున్నాయి.

''అబ్బబ్బ, పెరట్లోనుంచి అలా గొంతు చించుకోకబోతే ఇలా వచ్చి వెతికివ్వరాదూ?'' నిష్టూరాలు గూడా మొదలయ్యాయి. పట్టుదప్పిన లుంగీని వొడుపుగా పట్టి గబుక్కున లేచికూచున్నాడు రవి. ఒక గెంతులో ద్వారం దగ్గరికెళ్ళి అన్యమనస్కంగా నిలుచుందా అమ్మాయి. ఆ గెంతడంలో చివర కుచ్చులు కట్టిన ఆమె జడ రవి ముఖంమీదుగా జరజర ప్రాకిపోయింది. తత్తరపడ్డ రవిని జూచి ఆమె కాలి అందెలు ఘల్లుమని నవ్వాయి.

''పేపర్! దినపత్రిక కావాలి'' అంటూ కళ్ళు టపటప లాడించి, అంతలో గుర్తుకొచ్చిన దానిలా ''ఇప్పుడే వచ్చావా?'' అంటూ ఓ అప్రస్తుతమయిన ప్రశ్నవేసి, ఉలుకూ పలుకూ లేకుండా నిర్ఘాంతపడి జూస్తున్న రవిని విచిత్రంగా జూస్తూ ఆమె చెంగున అవతలికి దూకి వంటిట్లోకి పారిపోయింది.

''శ్యామలగదూ! అవును, శ్యామలే!!'' ఏదో నమ్మలేనట్టుగా అనుకున్నాడు రవి. ఇంతలో వసారాలోనుంచి తండ్రిగొంతు వినరావడంతో చెదిరిన జుట్టును వెనిక్కి త్రోసుకుంటూ గది వెలుపలి కొచ్చాడు.

రామనాథం గోగునారతో పగ్గం వేస్తున్నాడు. చిన్నయ్య దూరంగా దారం పురి పడడానికి ఒక కర్రపుల్ల సాయంతో మెలి దిప్పుతున్నాడు.

''అదేం మొద్దు నిద్దరా? మొత్తంమీద బాగా అలసిపోయి నట్టున్నావు! తెల్లవారి బండి లేటుగా వచ్చిందా ఏమిటి? ప్రయాణం సవ్యంగా జరిగిందా?'' నవ్వుతూ పల్కరించాడు రామనాథం.

తండ్రి రాకను గూడ గమనించకుండా మొద్దు నిద్రబోవడం చిన్నతనంగా తోచింది రవికి. ''అదేం లేదు నాన్నా! పాసింజర్లో బాగా ఖాళీ వున్నట్టే వుంది. కానీ మెయిల్లో కూచోడానికి కూడా స్థలం దొరికింది కాదు. రిజర్వు చేసిన నా బెర్తులో కూచున్న సింథీ వాళ్ళు నా బెర్త్ నా కివ్వకపోగా, కనీసం సీటుగూడ యివ్వలేదు. అయినా పిల్లా, జెల్లా—వాళ్ళుమాత్రం ఏం జేస్తారని? వాళ్ళగోలతో రాత్రి మెయిల్లో అంతా నాకు ముళ్ళపయిన కూర్చున్నట్లే వుంది. పాసింజర్లో ఎక్కి కూర్చొనేసరికి గంట రెండు దాటింది. వేళదప్పడంతో నాల్గింటికిగాని నిద్ర పట్టలేదు. నాల్గింటికెప్పుడో కొంచెం కునుకు పట్టినట్టుంది. ఐదింటికే అనుమల స్టేషన్లో ఒకడు భుజం తట్టి లేపి బలవంతంగా టీ త్రాగించి పదిహేను పైసలతో బాటూ నా నిద్ర కూడ పట్టుకపోయాడు'' అంటూ నవ్వసాగాడు రవి

సన్నగా మందహాసం జేస్తూ ''సర్లే. మాట్టాడ్డం మాత్రం బాగా నేర్చినట్టున్నావు'' అంటూ ఆగి వంటింటివైపు తిరిగి ''మీ అమ్మ పిలుస్తున్నట్టుంది చూడు'' అంటూ సంభాషణ మూలంగా కుంటువడిన పగ్గం పేనడాన్ని ఉధృతం చేయసాగాడు రామనాథం తొందర తొందరగా.

వంటిట్లోకొస్తూ అడిగాడు రవి—''ఏమమ్మా, రాజా ఇంకా రాలేదా?''

''ఏదీ నువ్వలా నిద్రిస్తూనే వచ్చాడు. ఇంత దాకా నువ్వు లేస్తావని చూస్తూనే వున్నాడు. ఇప్పుడే కన్పించడంలేదు.'' పొయ్యి మీదకు పాలగిన్నె మారుస్తూ ''వెళ్ళి ముఖం కడుక్కునిరా—కాఫీ తాగుదువు గానీ'' అంది జానకమ్మ.

ముఖం కడుక్కుని టవలుకోసం అమల్ని కేకేశాడు రవి.

అమల అన్న దగ్గరికొస్తూ చిరుకోపంగా ''పెరట్లో కెళ్ళే టప్పుడు తువ్వాలు తెచ్చుకోవాలని తెలీదా అన్నా, హాస్టల్లో అయితే ఏం జేస్తావు. బాత్రూమ్‌నుంచి బట్టలు లేకుండా పరుగెత్తుతావా ఏం'' అంటూ నవ్వసాగింది.

వస్తున్న నవ్వును ఆపుకుంటూ దబాయింపుగా అన్నాడు రవి ''అయితే ఏం, టవల్ తెచ్చిస్తావా లేదా.''

ఏం, నాకేం పట్టింది. అంతగా అయితే శ్యామల్ని పిలువు. పందిరి దగ్గర పూలు కోస్తూ వుంది.''

''శ్యామల ఎందుకు జేయాలి'' బింకంగా అన్నాడు రవి, అమల ఆంతర్యం అర్థం అయినా.

''ఏమో, నాకేం తెలుసు. కావలిస్తే దాన్నే అడుగు.'' వసారాలోనికి నడిచింది అమల.

''అసలు నీకు చేయాలి ముందు పెళ్ళి. మరీ అల్లరెక్కువయిపోతోంది'' తలమీద మొట్టికాయ వేయడానికి ఉంకించాడు రవి.

''అయ్యెయ్యో. నన్ను ముట్టుకోవద్దు'' పరుగెత్తుకెళ్ళి ఓ మూల నిల్చుంది అమల. ఆమె కాలు దగిలి ఒక వారగా పెట్టిన చెంబు దొర్లి నీళ్ళన్నీ ఒలికిపోయాయి. అవి ప్రక్కనేవున్న వారపత్రికలను తడిపేస్తూ చాప క్రిందికి జారిపోయాయి.

ఏదో కొంచెం అర్థమయినట్టుగా రవి పెదవి చివర ఒక చిరునవ్వు మెరిసి మాయమైంది.

కాఫీ తాగుతున్న రవికి గోడగడియారం 'అయిదు గంటలు' కొట్టడం విన్పించింది. అతనికి కాలం మనుషులకు తెలియకుండానే చాపక్రింద నీరులా జారిపోతున్నట్టు అన్పించింది.

''శ్యామలా, అమలకు కాఫీ ఇచ్చి వద్దువు రావే'' అని జానకమ్మ పిలవడంలోనే మళ్ళీ నిశ్శబ్దంలోనుంచి మెల్లమెల్లగా అందెల చప్పుడు విన్పించింది. రవి హృదయం కొన్ని మార్లెక్కువగా స్పందించింది. అమృతం తీసుకుబోతున్న భువన మోహినిలా శ్యామల కాఫీ గ్లాసందుకుని పెరటివైపు నడిచింది.

చెప్పులు వేసుకుని వీధిలోకి అడుగిడుతున్న కొడుకుతో ''పొద్దుండగానే వచ్చేయి. మబ్బెక్కినట్టుంది. వర్షం రావచ్చు'' అంటూ హెచ్చరించాడు రామనాథం.

వీధిలో సైకిల్ త్రోసుకుంటూ పోస్ట్‌మేన్ వడివేలు ఎదురయ్యాడు. సైకిల్ వెనుకసీట్లో ఆ సాయంత్రం పాసింజర్లో వెళ్ళవలసిన తపాలు ఉంది.

''స్టేషను కొస్తావా'' అన్నట్టుగా తన కలవాటయిన శబ్దాలు చేశాడు వడివేలు.

ఆకాశాన్ని చూపిస్తూ ''ఈ రోజు కుదరదేమో, రేపొస్తాను'' అన్నాడు రవి. వడివేలు రవిచేయి పట్టుకుని రిస్ట్‌వాచ్‌ను పరీక్షగా చూసి, బావుందంటూ నవ్వాడు. రేటెంత అన్నట్టుగా చేయి కిందికి పైకి ఆడించాడు.

రవి మూడువేళ్ళు చూపిస్తూ 'మూడొందల చిల్లర' అన్నాడు. 'అమ్మో' అన్నట్టుగా కళ్ళు తేలేసి, బుంగమూతి బెట్టి అంతలో ఏదో నిర్ణయానికి వచ్చిన వాడిలా తలపంకించుతూ ముందుకు కదిలాడు వడివేలు.

'వాచీ ఎవరికోసమో' అడగాలనుకుని మళ్ళీ మానుకున్నాడు రవి, వడివేలు చెప్పే సమాధానం అర్థం చేసుకోవడం మరీ అంత సులభం కాదని స్ఫురించడంతో. ఐతే తాను చిన్నతనంలో వడివేలుతో గంటల తరబడి మాటాడుతూ స్టేషను దారిలో నడచిన రోజులెన్నో అతనికి జ్ఞాపకం వచ్చాయి. తనకు బాల్యంలో వడివేలుతో మాట్లాడడానికి అడ్డగించని అతని మూగతనం—ఇంత చదువుకున్నాక ఎందుకు అవరోధంగా పరిణమించిందో అంతుచిక్కలేదతనికి.

మోచేతులు దాటిన అరచొక్కా, కాకీ నిక్కరు, తెలుపు నలుపు కలిసిన వెంట్రుకలు, చొక్కా జేబులో కొన్ని చిల్లర మల్లర కాగితాలు, ఒక పెన్సిలూ, చేతికొక కాశీదారమూ...తనకు తెలిసినప్పట్నుంచి వడివేలు ఇలానే వున్నాడు. ఆ వూరికి ఉత్తరంగా ప్రవహించే వాగులా, వాగుప్రక్కనున్న శ్రీరాముని గుడిలా, గుడి ముందున్న రావిచెట్టు కింది రచ్చలా, ఆ వూరికి సహజ లక్షణంగా కన్పిస్తాడు వడివేలు రవి దృష్టికి. రవి ఆలోచిస్తూ నడవసాగాడు.

ఇంటిముంగిట నీళ్ళుజల్లి, ముగ్గు క్రగేసి ఇంట్లోకి పోబోతున్న శారద, పరధ్యానంగా నడుస్తున్న రవిని చూచి ''ఏం రవీ, ఎప్పుడొచ్చావు. కాలేజీ కెళ్ళినంత మాత్రాన మమ్మల్నంతా మరిచిపోవాలనుందా?'' అంటూ నిష్ఠూరం జేసింది.

రవికేం జెప్పాలో అర్థంకాలేదు. ఏదో మాట్లాడాలని ప్రయత్నించి, ఏం తోచక నవ్వేస్తూ ''వచ్చింది ఈ రోజు ఉదయమే. సెలవులేమో ఇంకా రెండు నెలలకు పైగా వుంటాయి గదా. ఊర్లోనే వుంటానులే అక్కా'' అంటూ ఆగాడు.

అంతదాకా శారదలో కన్పిస్తున్నమార్పు రవి కప్పుడే అర్థమయింది. ఆమె కడుపుతో వున్నట్టుంది. అసలు ఆమెకు పెళ్ళెప్పుడయినట్టు? ఈదర గాలికి ఇంటిముందర వేసిన పెళ్ళి పందిరి తాలూకు మామిడాకుల తోరణాలు ఎండిపోయి వుండడంతో ''చాలా కాలమే అయిందిలే'' అన్నట్టుగ గలగలమన్నాయి:

శారద కొంచెం ఇబ్బందిగా కదిలి ''నీకు పెండ్లి పత్రిక పంపమని, ఉత్తరం రాయమని మా చిన్నాయనతో ఒకటికి నూరుసార్లు జెప్పాను. ముహూర్తం వరకూ వస్తావనే అనుకున్నాము. నువ్వేమో పెళ్ళయ్యాక ఆరు నెలలకు గాని వచ్చావుగాదు.'' శారద ముఖంలో విచారం రవికి బాధ కల్గించింది.

''ఉత్తరం అందింది గాని కుదరలేదక్కా. అవును గాని మా బావెక్కడున్నారు'' అన్నాడు రవి పరిశీలనగా ఇంట్లోకి జూస్తూ.

''నిన్నటిదాకా ఇక్కడే వున్నారు. రామాపురంలో చక్కెర మిల్లు పెట్టబోతున్నారటగదా. అక్కడే ఏదో రోడ్డు కాంట్రాక్టట. ఎప్పుడొస్తారో తెలియదు. ఇదో ఈ గంటలో రావచ్చు. వచ్చిన అరగంటలోనే తిరుగుముఖం అనుకో. వేళకు తిండినీళ్ళు ఉండాలన్న ధ్యాస ఆ మనిషికి బొత్తిగా ఏ కోశానా లేదు...మామగారేమో మంచం దిగలేరు. అత్తగారికా కాలు ఒకచోట నిలవదు. ఈ యిలాఖాలో ఆమెకు బంధువులు లేని వూరులేదంటే నమ్మ. ఈ మూడునెల్లూ ఆ వూర్లో నాకొక రోజు యుగంగా గడచిందనుకో. పోయిన అమావాశ్యకు ముందునాడే అమ్మ, రమేష్ వచ్చి నాలుగు రోజులుండి నన్ను తీసుకొచ్చారు. ఇంతకూ ఆయనేమో నేను ఇక్కడికి రావడానికి ససేమిరా ఒప్పుకోలేదనుకో. మొదటి కాన్పు పుట్టింటిలోనే జరగాలని పట్టుబట్టి అమ్మ బలవంతంగా తీసుకొచ్చింది...'' ఇంటిలోనుంచీ పిలుపు రావడంతో ''ఇంట్లోకి రా రవీ. అప్పట్నుంచి వీధిలోనుంచోబెట్టే మాటాడేస్తున్నాను'' అంటూ పిలిచింది శారద.

''తొందరేముందిలే అక్కా! అలా వీధి చివరి కెళ్ళొస్తాను'' అంటూ రవి ముందుకు నడిచాడు.

రవి ఆ సాయంకాలం ఇల్లు వదిలి రావడంలో ముఖ్యోద్దేశం తన పాత స్నేహితులను కలుద్దామనే. కానీ ఎవరో ఒకరిద్దరుతప్ప మిగిలిన వాళ్లందరూ ఇంట్లో లేనట్టు తెలిసింది. ఎక్కడికి బోయారంటే శనివారం గదా. సంతగేటుకు పోయారని సమాధానం. చివరకు వాగు దగ్గరికైనా వెళ్ళి రావాలనుకున్నాడు రవి. ఇంతలో ఒకటి రెండు చినుకులు రాలడంతో ఇంటిముఖం పట్టాడు. ఇళ్ళలో ఎలక్ట్రిక్ దీపాలు ఒక్కటొక్కటిగా వెలుగుతున్నాయి.

''ఏమయ్యో! ఇలా ఒకసారి వచ్చిపో'' అంటూ టీ హోటల్లో నుంచి చెంగల్రాయుల కేక విన్పించింది. తన యీడు వాడే అయిన చెంగల్రాయులు అప్పుడే కుటుంబాన్నంతా ఒక్కడే పోషిస్తున్న సంగతి తెలిసి రవి ఆశ్చర్యపోయాడు. వద్దంటున్నా వినకుండా ''డబుల్‌స్ట్రాంగ్ టీ'' నొకదాన్ని రవిచే తాగించి, ''మళ్ళీ రేపురా. తెల్లవారి ఏడుగంటలకే నా షాప్ రెడీ''అంటూ సాగనంపాడు చెంగల్రాయులు. ఇల్లు చేరేసరికి ఆరున్నర. ప్రాంతీయ వార్తలు ముగిసి సేద్యసమాచారం వస్తోంది. వీధివైపు గదిలో రామనాథం రేడియో వింటూ పేపరు తిరగేస్తున్నాడు.

(ఇంకా వుంది)